## 276వ అధ్యాయం

# ٢٧٦ ـ بَابُ النَّهْيِ عَنِ الْغِشِّ وَالْخِدَاعِ

# నకిలీల తయారీ, మోసం చేయటం నిషిద్ధం

قَالَ اللهُ تَعَالَى: ﴿وَالَّذِينَ يُؤْذُونَ الْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ بِغَيْرِ مَا اكْتَسَبُوا فَقَدِ احْتَمَلُوا بُهْتَانًا وَإِثْمًا مُّبِينًا﴾ [الأحزاب: ٥٨].

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ఏ తప్పూ చేయకపోయినా విశ్వాసులైన స్త్రీ పురుషులకు మనస్తాపం కలిగించేవారు, ఒక పెద్ద అభాండభారాన్ని, ఒక స్పష్టమైన పాప భారాన్ని తమ తలపై మోపుకున్నట్లే."

*(అల్ అహ్‌జాబ్: 58)*

١٥٨١ ـ وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «مَنْ حَمَلَ عَلَيْنَا السِّلَاحَ فَلَيْسَ مِنَّا، وَمَنْ غَشَّنَا فَلَيْسَ مِنَّا» رواه مسلم. وفي رِوَايَةٍ لَهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ مَرَّ عَلَى صُبْرَةِ طَعَامٍ، فَأَدْخَلَ يَدَهُ فِيهَا، فَنَالَتْ أَصَابِعُهُ بَلَلًا، فَقَالَ: «مَا هٰذَا يَا صَاحِبَ الطَّعَامِ؟» قَالَ: أَصَابَتْهُ السَّمَاءُ يَا رَسُولَ اللهِ! قَالَ: «أَفَلَا جَعَلْتَهُ فَوْقَ الطَّعَامِ حَتَّى يَرَاهُ النَّاسُ! مَنْ غَشَّنَا فَلَيْسَ مِنَّا».

1581. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మా మీదకు ఆయుధం లేపేవాడు మా (ముస్లిం లలోని) వాడుకాదు. మమ్మల్ని మోసం చేసేవాడు మా(లోని) వాడుకాదు.

(ముస్లిం)

ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: దైవప్రవక్త (సల్లం) (ఒకసారి) ఓ ధాన్యపు కుప్ప దగ్గర్నుంచి వెళ్తూ అందులో చెయ్యి ఉంచి చూశారు. వేళ్లకు తడిగా అనిపించింది. అప్పుడాయన "ఓ ధాన్యం మనిషీ! ఏమిటిది?" అని అడిగారు. అందుకతను, "వర్షానికి తడిసిపోయినై దైవప్రవక్తా!" అన్నాడు. అది విని ఆయన "మరయితే దాన్ని ప్రజలకు కనపడేలా పైన ఎందుకుంచలేదూ? (విను)

మమ్మల్ని మోసం చేసేవాడు మాలోని వాడుకాడు" అని హెచ్చరించారు.

(సహీహ్ ముస్లింలోని ఈమాన్ ప్రకరణం)

## ముఖ్యాంశాలు

1) ఆయుధాలు లేపటమంటే ముస్లిం సంఘానికి ఎదురు తిరగటం, వారి మీద తిరుగుబాటు చేయటం లేదా నిష్కారణంగా ముస్లిం మీద ఖడ్గం, తుపాకీ (రివాల్వర్) మొదలగు ఆయుధాలు సంధించి అతన్ని హత్యచేయటం అని అర్థం. దురదృష్టం కొద్దీ ఈ రోజుల్లో ఈ తరహా ఉగ్రవాదంతో సమాజం అట్టుడికిపోతోంది.

2) నకిలీలు తయారుచేయటం, మోసగించటం లాంటివి అనేక రకాలుగా జరుగుతాయి. వాటిలో ఒకటి ఆంతరంగికమైనది. ఉదా: అసత్యానికి సత్యం ముసుగు తొడిగించటం. రెండోది, భౌతికమైనది, బాహ్యపరమైనది. ఉదా: సరుకులో ఏదైనా లోపముంటే దాన్ని బహిర్గతం చేయకుండా అమ్మేయటం. తూకం ఎక్కువ రావాలన్న ఉద్దేశ్యంతో మంచి సరుకులో నాశిరకపు లేదా ఇతర వస్తువులేవయినా కలిపేయటం. ఇలాంటి ఉదాహరణలు మనం ఎన్నో పేర్కొనవచ్చు.

3) మా వాడు కాడు అంటే మా ముస్లింల విధానంపై లేడు. అతను అనుసరిస్తున్న ఈ వైఖరి విశ్వసనీయమైనది కాదు, విశ్వాసఘాతుకంతో కూడుకున్నది అని అర్థం. కనుక ప్రతి ముస్లిం అన్నిరకాల మోసపూరిత విధానాలకు దూరంగా ఉండాలన్నది ఈ హదీసు ఉద్దేశ్యం.

١٥٨٢ - وَعَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ، قَالَ: «لَا تَنَاجَشُوا» متفقٌ عليه.

1582. హజ్రత్ అబూహురైరా (రజి)గారే చేసిన వేరొక కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: కొనుగోలు చేయాలన్న ఉద్దేశ్యం లేకపోయినా (వస్తువు ధరపెంచే నెపంతో) ఎక్కువ ధరకు బేరమాడకండి.

(బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలోని లావాదేవీల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. ఒక మనిషి ఒక వస్తువును కొనుగోలు చేసే ఉద్దేశ్యం లేకపోయినా దాన్ని ఎక్కువ ధరకు బేరమాడతాడు. దానివల్ల అసలు కొనుగోలుదారుడు మోసపోతాడు. దాని వాస్తవ ధరకన్నా చాలా ఎక్కువ ధరకు దాన్ని కొనుగోలు చేయవలసి వస్తుంది. ఇదీ ఒక రకంగా మోసమే కనుక ముస్లింలు ఇందుకు దూరంగా ఉండాలి.

١٥٨٣ - وَعَنِ ابْنِ عُمَرَ رَضِيَ اللهُ

1583. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం)

عَنْهُمَا، أَنَّ النَّبِيَّ ﷺ نَهَى عَنِ النَّجْشِ. متفقٌ عليه.

'నజష్'ను (మోసపుచ్చే ఉద్దేశ్యంతో ధర ఎక్కువ పలికించటాన్ని) వారించారు. (బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలోని లావాదేవీల ప్రకరణం)

١٥٨٤ - وَعَنْهُ قَالَ: ذَكَرَ رَجُلٌ لِرَسُولِ اللهِ ﷺ أَنَّهُ يُخْدَعُ فِي الْبُيُوعِ؟ فَقَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ بَايَعْتَ، فَقُلْ لَا خِلَابَةَ» متفقٌ عليه. «الخِلَابَةُ» بخاءٍ معجمةٍ مكسورة، وباءٍ موحدة: وهي الخديعةُ.

1584. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి)గారే చేసిన కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ తాను క్రయ విక్రయాల్లో ఎల్లప్పుడూ మోసపోతుం టానని చెప్పాడు. అందుకు దైవప్రవక్త (సల్లం) అతనికి "(ఇకముందు) నువ్వు లావాదేవీలు జరిపితే 'మోసం ఉండ కూడదు' అని చెప్పెయ్యి" అని ఉపదే శించారు. (బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలోని లావాదేవీల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

పై హదీసులోని 'మోసం ఉండకూడదు' అనే వాక్యం వినియోగదారుని ఎంపిక హక్కుని సూచిస్తోంది. అంటే సరుకులో ఏదయినా మోసం ఉందని తెలిస్తే కొనుగోలు దారునికి ఆ సరుకును వాపసు చేసే హక్కుంటుంది. అమ్మకం దారులు కూడా కొనుగోలుదారులకు చెందిన ఆ హక్కును గౌరవించాలి.

١٥٨٥ - وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ خَبَّبَ زَوْجَةَ امْرِئٍ، أَوْ مَمْلُوكَهُ، فَلَيْسَ مِنَّا» رواه أبو داود. «خبب» بخاءٍ معجمة، ثُمَّ باءٍ موحدة مكررة: أَيْ: أَفْسَدَهُ وَخَدَعَهُ.

1585. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఒకరి భార్యను లేక బానిసను మోసగించేవాడు మాలోని వాడు కాడు. (అబూదావూద్)

(సుననె అబూదావూద్‌లోని అదబ్ ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఒకరి భార్యను లేక బానిసను తన భర్తకు లేదా యజమానికి వ్యతిరేకంగా పురికొల్పటం, వారి మధ్య అపార్థాలు సృష్టించి వారికి ఒండొకరి మీద ద్వేషం కలిగేలా చేయటం చాలా పెద్దపాపం. విశ్వాసి అనేవాడు ప్రజల మధ్య సత్సంబంధాలు ఏర్పరచాలిగాని ఉన్న సంబంధాల్ని చెడగొట్టరాదు.